# 4. ఆకాంక్ష

## ప్రతిపదార్థము - తాత్పర్యము

**1. విరిగె పరాధికార పరిపీడిత దుఃఖకుజంబు; తోచెనా**
**ధరణి స్వతంత్రచూతము, సుధామయ పక్వఫలంబు లిచ్చు సో**
**దరవరులార! పోషణ విధానము నారసి పెంచకుండినన్**
**పురువులుముట్టి పర్ణఫల పుష్పమలం దిని పాడు సేయవే !**

జ. ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| సోదరవరులార | = | ఓ శ్రేష్ఠులైన అన్నదమ్ములారా ! |
| పరాధికార పరిపీడిత దుఃఖకుజంబు; | | |
| పరాధికార (పర + అధికార) | = | ఇతరుల అధికారము వల్ల |
| పరిపీడిత | = | మిక్కిలి బాధింపబడిన |
| దుఃఖకుజంబు | = | దుఃఖములు అనే చెట్టు |
| విరిగె | = | విరిగిపోయింది (నాశనమయ్యింది) (బానిసత్వం పోయింది) |
| ఆ ధరణిన్ | = | ఆ భారత భూమిపై |
| స్వతంత్ర చూతము | = | స్వాతంత్ర్యము అనే మామిడిచెట్టు |
| తోచెన్ | = | పుట్టింది (మొలిచింది) |
| సుధామయ పక్వఫలంబులు; | | |
| సుధామయ | = | అమృతమయములైన |
| పక్వ | = | పండిన |
| ఫలంబులు | = | పండ్లను |
| ఇచ్చున్ | = | ఇస్తుంది (ఆ స్వాతంత్ర్య వృక్షము ఇస్తుంది) |
| పోషణ విధానమున్ | = | ఆ చెట్టును పెంచే విధానాన్ని |
| ఆరసి | = | తెలిసికొని |
| పెంచకుండినన్ | = | పెంచకపోతే (స్వతంత్రము అనే మామిడి వృక్షాన్ని సరిగా పెంచకపోతే) |
| పురువులు | = | పురుగులు |
| ముట్టి | = | క్రమ్మి (ఆవరించి) |
| పర్ణఫల పుష్పములన్; | | |
| పర్ణ | = | ఆకులనూ |
| ఫల | = | పండ్లనూ |
| పుష్పములన్ | = | పూలనూ |

| | | |
|---|---|---|
| తిని | = | తిని |
| పాడు సేయవే (పాడు+చేయవే) | = | పాడు చేయకుండా ఉంటాయా? |

**తాత్పర్యం :**

ఓ శ్రేష్ఠులైన అన్నదమ్ములారా! ఇతరుల అధికారంచే ఎక్కువగా పీడింపబడిన దుఃఖము అనే వృక్షము విరిగిపోయింది. భారత భూమిలో స్వతంత్రము అనే మామిడి చెట్టు మొలిచింది. ఆ వృక్షము అమృతమయములైన పండిన పండ్లను ఇస్తుంది. ఆ చెట్టును పెంచే పద్ధతిని తెలిసికొని పెంచకపోతే, దానికి పురుగులు పట్టి ఆ చెట్టు యొక్క ఆకులను, పండ్లను, పూలను తిని పాడు చేయకుండా ఉండవు. (పాడుచేస్తాయి) (స్వాతంత్ర్య వృక్షానికి చీడపీడలు వస్తాయి.)

**2. గ్రామకుటీరకోటులను కాపురముండెడు కర్షకాళికిన్**
**సేమముఁగోరివెంటనె నశింపగఁజేయు నిరక్షరాస్యతన్**
**శ్రామిక శ్రేయసాస్పద విచారణభావము రెక్కొనం భవ**
**ద్గ్రామమునందు నిల్పవలె ధార్మిక లైబ్రరి, పాఠశాలయన్.**

**జ. ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| గ్రామకుటీర కోటులను | = | కోట్లాది గ్రామాలలోని గుడిసెలలో |
| కాపురముండెడు | = | నివసించే |
| కర్షకాళికిన్ (కర్షక + ఆళికిన్) | = | వ్యవసాయదారుల సమూహానికి |
| సేమమున్ | = | క్షేమాన్ని |
| కోరి | = | కోరుకొని |
| నిరక్షరాస్యతన్ | = | చదువురానితనాన్ని |
| వెంటనే | = | తక్షణమే |
| నశింపగఁజేయన్ (నశింపగన్ + చేయన్) | = | పోగొట్టడానికి |
| శ్రామిక శ్రేయసాస్పద విచారణ భావము; | | |
| శామిక | = | కార్మికుల (శ్రమజీవుల) యొక్క |
| శ్రేయస | = | మేలునకు |
| ఆస్పద | = | స్థానమైన |
| విచారణ భావము | = | ఆలోచనా భావము |
| రెక్కొనన్ | = | వర్థిల్లగా (వృద్ధిపొందే విధంగా) |
| భవద్గ్రామమునందున్ (భవత్ + గ్రామమునందున్) | = | మీ గ్రామంలో |
| ధార్మికలైబ్రరి | = | ఉచిత గ్రంథాలయం |
| పాఠశాలయున్ | = | బడియూ |
| నిల్పవలెన్ | = | నెలకొల్పాలి (ఏర్పాటు చేయాలి) |

**తాత్పర్యం :**

గ్రామాలలో కోట్లాది గుడిసెలలో కాపురము చేసే రైతులకు క్షేమాన్ని కోరుకొని, వారి నిరక్షరాస్యతను తక్షణమే పోగొట్టడానికి, కార్మికుల మేలునకు చోటయిన ఆలోచనా భావం పెంపొందే విధంగా, మీ గ్రామంలో ఉచిత గ్రంథాలయం, పాఠశాల ఏర్పాటు చేయాలి.

## 20 పంక్తుల సమాధాన ప్రశ్నలు

**1. 'ఆకాంక్ష' ఖండిక ద్వారా కవి జాతికి ఏమని ప్రబోధమిచ్చాడు ?**

జ. **జాతికి కవిగారి ప్రబోధము :** స్వాతంత్ర్యము వచ్చిందని సంతోషిస్తూ కర్తవ్యములను మరచిపోతే, మీకు మీరే కష్టములను తెచ్చుకుంటారు. స్వాతంత్ర్యము అనేది మామిడిచెట్టు వంటిది. దానిని సరిగా పోషించకపోతే దానిని పరుగులు తిని పాడుచేస్తాయి.

సోదరులారా! ప్రపంచంలో భారతదేశము తల ఎత్తుకొని ఇతర దేశాలతో బంధుత్వమును సాగించాలి. జాతిమత వర్గ భేదాలను పాతిపెట్టాలి. దేశవాసులు సంతుష్టిగా జీవించేలా చూడాలి.

స్వాతంత్ర్య సాధన సమయంలో మీరు చూపిన శక్తినీ, సామర్థ్యాన్నీ జారవిడవకండి. ఆ శక్తి సామర్థ్యాలను జాతిని ఐక్యం చేయడానికీ, హరిజనుల దుఃఖాన్ని పోగొట్టడానికీ, కర్షక కార్మికుల బాధలు పోవడానికీ ఉపయోగించండి.

కడుపు కోసం గ్రామశ్రేయస్సును, గ్రామం కోసం రాష్ట్రాన్ని, రాష్ట్రం కోసం దేశాన్ని విడిచిపెట్టకుండా దేశ సౌభాగ్యం కోసం, ప్రపంచంతో సఖ్యం చేయండి. పాక్షిక చింత విడిచిపెట్టండి.

భారతదేశం అంతా ధనవంతమైనదని అనుకోకండి. ఎందరో బీదవారు ఉన్నారు. ప్రతి గ్రామంలో రైతుల నిరక్షరాస్యత పోయేలా లైబ్రరి, పాఠశాల పెట్టాలి.

మెత్తగా హితాన్ని బోధించాలి. కఠినత్వం చూపి, చెడ్డ పని మాన్పించాలి. ఇతర భాషల వారిని ప్రేమించాలి. కులంపేరు చెప్పి, మనిషిని వెలివేస్తే జాతికి చెడ్డ వస్తుంది.

మనదేశంలో భాషలు, కులాలు ఎన్నో ఉన్నా అందరూ కలిసి ఉంటే, మనల్ని ఎదిరించే వారుండరు. అన్ని కులాల వారు, మతాల వారు కలిసి ఉండాలి.

వివిధ మతాలను పాటించే వారి ధనమానములకు భంగము కలిగించే పోకడలను విడిచిపెట్టి, ఒకే మార్గంలో నడచుకోవాలి. మన ధర్మాన్ని తెలిసికోవాలి. మనలో హృదయం పరివర్తనం కావాలి.

సమస్త భూమండలానికి ఆధ్యాత్మిక బలాన్ని కల్గించే విశిష్ట మార్గాన్నీ చెడ్డపనులు వద్దని ప్రబోధించే గొప్పతనాన్నీ అందరికీ అభ్యుదయాన్నికల్లించే సంఘశక్తినీ బహుముఖమైన విజ్ఞాన పాటవాన్నీ క్షీణదశకు తెచ్చేవారు, భారత క్షేమానికి వేరు పరుగులవంటి వారు. అటువంటి వారిని ఏరిపారవేయడానికి దీక్షను చేపట్టండి.

గాంధీ మహాత్ముడి శక్తి, మనకు తోడునీడగా ఉంటుంది. ఆయన యందు భక్తి కలిగియుంటే మనకు సత్కీర్తి కలుగుతుంది.

ఈ విధంగా కవి, భరత జాతిని ప్రబోధించాడు.

# సందర్భ సహిత వాఖ్యలు

**1. దేశవాసులుబొందెదు తీరుఁజూడు.**

**జ. కవి పరిచయం :** ఈ వాక్యం పాలా వెంకట సుబ్బయ్య గారు రచించిన 'అమరజీవి – బాపూజీ' కావ్యంలో నుండి గ్రహించిన 'ఆకాంక్ష' అనే పద్యభాగంలోనిది.

**సందర్భం :** కవి ఈ కవితా ఖండికలో భారతీయ సోదరులకు స్వాతంత్ర సందేశం ఇచ్చాడు. దేశంలోని జాతి మత వర్గ భేదాలను పాతిపెట్టమన్నాడు. ఇతర విషయాలను హృదయంలో అణచిపెట్టమన్నాడు. దేశంలో ఉండే ప్రజలందరూ నిత్యం జీవితంలో తృప్తిని పొందేటట్లు చూడమని కవి భారతీయులకు సందేశము ఇచ్చిన సందర్భంలోని వాక్యం.

**అర్థం :** దేశంలో ఉండేవారు తృప్తిని పొందేటట్లు చూడు.

**వ్యాఖ్య :** దేశంలో ప్రజలు జాతిమత వర్గ భేదాలు పోయి, నిత్య జీవితం తృప్తిగా ఉండాలని కవి ఆకాంక్ష

**2. నిల్పవలె ధార్మిక లైబ్రరి, పాఠశాలయున్**

**జ. కవి పరిచయం :** ఈ వాక్యం పాలా వెంకట సుబ్బయ్య గారు రచించిన 'అమరజీవి – బాపూజీ' కావ్యంలో నుండి గ్రహించిన 'ఆకాంక్ష' అనే పద్యభాగంలోనిది.

**సందర్భం :** కవి భారతీయ సోదరులకు స్వాతంత్ర్య సందేశం ఇచ్చాడు. గ్రామాలలో కోట్లాది గుడిసెలలో రైతులు కాపురం ఉంటున్నారు. ఆ రైతుల క్షేమాన్ని కోరి, ఆ రైతుల నిరక్షరాస్యత పోయేటట్లు, ఆ శ్రమ జీవులకు మేలు కల్గించే ఆలోచన వృద్ధి పొందేటట్లు, అన్ని గ్రామాలలో ధార్మిక లైబ్రరీని, పాఠశాలను ప్రారంభించండి అని కవి భారతీయులకు సందేశం ఇచ్చిన సందర్భంలోనిది.

**అర్థం :** పాఠశాలను, ఉచితంగా గ్రంథాలయాన్ని స్థాపించండి.

**వ్యాఖ్య :** రైతుల నిరక్షరాస్యత పోవడానికి గ్రామాలలో ఉచితంగా లైబ్రరీని,పాఠశాలను నెలకొల్పాలని కవి సందేశం ఇచ్చాడు.

**3. చేటుమూడును జాతికి శిష్టులార**

**జ. కవి పరిచయం :** ఈ వాక్యం పాలా వెంకట సుబ్బయ్య గారు రచించిన 'అమరజీవి – బాపూజీ ' కావ్యంలో నుండి గ్రహించిన 'ఆకాంక్ష' అనే పద్యభాగంలోనిది.

**సందర్భం :** కవి వెంకట సుబ్బయ్య భారతీయులకు స్వాతంత్ర్య సందేశం ఇచ్చాడు. అంటరానితనాన్ని పాటించడం తప్పని చెప్పాడు. అందువల్ల జాతికి చేటు కలుగుతుందని హెచ్చరించాడు. గొలుసులో ఒక కొలికికి బలం తగ్గితే ఆ గొలుసు తెగిపోతుంది. అలాగే కులం పేరు చెప్పి ప్రజలలో ఒక వ్యక్తిని వెలివేస్తే ఆ జాతికి చేటు మూడుతుందని కవి భారతీయులను హెచ్చరించిన సందర్భంలోనిది.

**అర్థం :** ఓ సత్పురుషులారా! జాతికి చెడు సిద్ధిస్తుంది.

**వ్యాఖ్య :** అంటరానితనాన్ని పాటించి, ఒక వ్యక్తి కులము అంటరానిదని అతణ్ణి వెలివేస్తే ఆ జాతికి అశుభము కలుగుతుంది అని కవి అభిప్రాయం.

## సంక్షిప్త సమాధాన ప్రశ్నలు

**1. స్వాతంత్ర్యం కోసం పోరాడినవారెవరు ?**

జ. బానిసత్వాన్ని పారద్రోలి, స్వాతంత్ర్యాన్ని మనదేశానికి తీసుకువచ్చిన మహానుభావులు ఎందరో ఉన్నారు. వారిలో 1) మహాత్మాగాంధీ 2) జవహర్‌లాల్ నెహ్రూ 3) సర్దారు వల్లభబాయ్ పటేల్ 4) బాబూ రాజేంద్రప్రసాద్ 5) పట్టాభి సీతారామయ్యగారు 6) శ్రీమాన్ చక్రవర్తుల రాజగోపాలాచార్యులుగారు. 7) యన్.జి. రంగాగారు – మొదలయిన వారు చెప్పకోదగిన స్వాతంత్ర్య పోరాటయోధులు.

## ఏకవాక్య సమాధాన ప్రశ్నలు

**1. పాలా వెంకట సుబ్బయ్య కవిత్వ గురువు ఎవరు ?**

జ. పాలా వెంకట సుబ్బయ్యకు గల కవిత్వ గురువు "బ్రహ్మశ్రీ వేదం వెంకట కృష్ణశర్మగారు".

**2. వెంకట సుబ్బయ్యకు గల బిరుదులేవి ?**

జ. వెంకట సుబ్బయ్యకు 1) మధురకవి 2) కవిరాజహంస అనే బిరుదులు ఉన్నాయి.

**3. వెంకట సుబ్బయ్య ఏ పత్రికకు సంపాదకత్వం వహించారు?**

జ. వెంకట సుబ్బయ్య "శ్రీశైలప్రభ" అనే ధార్మిక పత్రికకు సంపాదకత్వం వహించారు.

**4. స్వాతంత్ర్య ఫలితాన్ని కవి దేనితో పోల్చారు ?**

జ. స్వాతంత్ర్య ఫలితాన్ని పాలా సుబ్బయ్య కవి మామిడిచెట్టుతో పోల్చారు.

**5. దేశభాగ్యాన్ని కోరేవారు దేనితో స్నేహాన్ని ఆపకూడదు ?**

జ. దేశ భాగ్యాన్ని కోరేవారు "అవనితో" స్నేహాన్ని ఆపకూడదు.

**6. గ్రామాలలో నిలుపవలసినవేవి ?**

జ. గ్రామాలలో ధార్మిక లైబ్రరీని, పాఠశాలను నిలపాలి.

**7. భారతభూమి 'పుష్కల ధనాఢ్య' అనుకొనేవాడెవడు ?**

జ. పట్టణాలలో ఉండి భోగపరులై, పల్లెటూళ్ళలో ఉండే బీదవారి జీవితాన్ని చూడని వారు భారతభూమి పుష్కలధనాఢ్య అనుకుంటారు.

**8. గొలుసులో బలమైనదేమిటి ?**

జ. గొలుసులో బలమైనది "కొలికి".

**9. భూతలానికి విశిష్టపథాన్ని చేకూర్చేదేమిటి ?**

జ. భూతలానికి విశిష్టపథాన్ని చేకూర్చేది "ఆధ్యాత్మిక బలం" .

**10. బాపూజీ పట్ల ప్రజలకు ఏమి ఉండాలి ?**

జ. బాపూజీ పట్ల ప్రజలకు 'భక్తి' ఉండాలి.

✲✲✲